## క్లుప్తంగా

### అమ్మవారికి అభిషేకాలు



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

**చీపురుపల్లి:** పట్టణంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ నేతృత్వంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలుచేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకు న్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు.

### భూరీసర్వేకు సహకరించండి



మాట్లాడుతున్న డీటీ శివప్రసాద్

**బొండపల్లి:** వైఎస్సార్– జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా చేప డుతున్న సమగ్ర భూరీసర్వేతో భూసమస్య లకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని డీటీ శివప్రసాద్ అన్నారు. మండలంలోని అంబటి వలస గ్రామంలో భూసర్వేపై ఆదివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ భూరీసర్వేకు రైతులు సహ కరించాలని కోరారు. సర్వే చేసే సమయంలో రైతులు తమ భూముల వద్ద ఉండాలని, ఏమైనా సమస్యలు ఉంటే సర్వే సిబ్బంది దృ ష్టికి తీసుకురావాలని సూచించారు. వీఆర్‌ఓ రమేష్, ఎంపీటీసీ తాళ్లపూడి అప్పలనా యుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు రౌతు చిన్న తదితరులు పాల్గొన్నారు.

### విశ్రాంత ఆర్మీ ఉద్యోగికి సన్మానం



శ్రీనివాసరావుకు స్వాగతం పలుకుతున్న కుమరాం గ్రామస్తులు

**జామి:** మండలంలోని కుమరాం గ్రామానికి చెందిన పిన్నింటి శ్రీనివాసరావు ఆర్మీలో ఉద్యోగ విరమణ చేసి స్వగ్రామానికి ఆది వారం చేరుకోవడంతో గ్రామస్తులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. శ్రీనివాసరావు 20 ఏళ్లు ఆర్మీలో పనిచేసి, సుబేదార్ ర్యాంకులో ఉద్యోగ విరమణ చేశారు. ఆయన్ని గ్రామ స్తులు, యువత సత్కరించి, జాతీయ జెం డాలతో ర్యాలీగా స్వాగతం పలికారు.

### ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



ఆస్పత్రిలో వృద్ధురాలు పాపమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ గురునాయుడు

**చీపురుపల్లిరూరల్(గరివిడి):** గరివిడి మండలం కందిపేట గ్రామానికి చెందిన వృద్ధురాలు ఎడ్ల పాపమ్మ శ్రీకాకుళం జిల్లాలోని జెమ్స్ ఆస్పత్రిలో గుండె ఆపరేషన్ చేయించు కుని, వైద్య సేవలు పొందుతున్నారు. ఆమెకు జూలై నెలకు సంబంధించిన వృద్ధాప్య పింఛ న్‌ను ఆ గ్రామ వలంటీర్ పెనుమజ్జి గురునా యుడు ఆదివారం ఆస్పత్రికి వెళ్లి అందజే శారు. వలంటీర్‌ను ఎంపీటీసీ కంది శ్రీనివాస రావు, సర్పంచ్ మీసాల నాగభూషణ్, ఏఎం సీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, అభి నందించారు.

### సొంత నిధులతో శ్మశానవాటిక అభివృద్ధి



శ్మశానవాటికలో భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న రాజా

**గజపతినగరం:** స్థానిక దిగువ వీధి శ్మశాన వాటికలో రూ.5 లక్షల సొంత నిధులతో మండల కేంద్రానికి చెందిన వ్యాపారి ఆరిశెట్టి రాజా పలు అభివృద్ధి పనులను చేయిస్తు న్నారు. తన తండ్రి సత్యనారాయణ(బాబ్జి) జ్ఞాపకార్థం ఈ పనులు చేపడుతున్నట్టు రాజా చెప్పారు. శ్మశాన వాటికలో ఓ భవనం నిర్మిస్తున్నారు. అంత్య క్రియలకు ఇబ్బం దులు లేకుండా నీటి సదుపాయం కోసం బోరు తవ్వించారు. స్నానాలు చేసుకునేం దుకు 11 షవర్లు ఏర్పాటు చేయనున్నారు. రాజాను గజపతినగరం దిగువ వీధి వాసులు అభినందిస్తున్నారు.

# సంక్షేమ పథకాలతో పేదలకు ఆర్థిక భరోసా



మహిళకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి

**లక్కవరపుకోట:** ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహ న్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద, బడుగు, బలహీన వర్గాలకు ఆర్థిక భరోసా కల్పిస్తు న్నాయని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని రెల్లి గౌరమ్మపేట సచివా లయం పరిధి శ్రీరాంపు రం గ్రామంలో ఆదివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వ హించారు. ముందుగా గ్రామంలోని అంబేద్కర్ విగ్ర హానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. అనంతరం మండల ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, నాయకులు

ఉన్నాయా అని ప్రజలను ఆరా తీశారు. గ్రామస్తులు తెలిపిన సమస్యలను కొన్ని అక్కడికక్కడే పరిష్కరిం చారు. మరికొన్ని సమస్యలను త్వరలో పరిష్కరిం చేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ బాపూజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవ లన్నీ ఇంటిముంగిటకే అందుతున్నాయని చెప్పారు. అవ్వాతాతలకు ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారు జామున తలుపు తట్టి పింఛన్ అందిస్తున్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలుకాని సంక్షేమం మన రాష్ట్రంలో అమలవుతోందని, పారదర్శకం గా, అవినీతికి తావులేకుండా పథకాలు మంజూరు చేస్తు న్నట్లు తెలిపారు. ఈ ఘనత సీఎం జగన్‌కే దక్కు తుంద న్నారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, నాడు –నేడు పథకంలో భాగంగా వేల కోట్ల రూపాయలు వెచ్చించి పాఠశాలలు,అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశా లలు, ఆస్పత్రులను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల్లో 98 శాతం ఇప్పటికే అమలు చేశామని తెలిపారు. ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, సర్పంచ్ వి.సావిత్రి, వైఎస్సార్‌సీపీ నాయ కులు గుల్లిపల్లి సీతారాం, వానపల్లి చెల్లయ్య, పిని శెట్టి కిష్టప్ప, ఆదిరెడ్డి అర్జున, గేదెల శాంత, దొడ్డి రాంబాబు, గొలగాని సత్యనారాయణ, ఇమంది ముత్యం తదితరులు పాల్గొన్నారు.

# బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి



మహిళకు పథకాల బుక్ లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే అప్పలనరసయ్య

**గంట్యాడ:** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలం లోని వసంత గ్రామంలో ఆది వారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్య క్రమం నిర్వహించారు. గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. మండల, స్థానిక ప్రజాప్రతి నిధులు, నాయకులతో కలిసి ఇంటిం టికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో ప్రతీ కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరి ష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈసందర్భం గా మాట్లాడుతూ పార్టీలు, కులాలకు అతీతతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తు న్నామ న్నారు. గడపగడపకు తిరుగుతున్నప్పుడు తమ దృష్టికి వచ్చే సమస్యలను త్వరితగతిన పరి ష్కరిస్తున్నామని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సం క్షేమ పథకాల క్యాలెండర్‌ను రూపొందించి చెప్పిన తేదీ నాటికి పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. సంక్షేమ పథకాల వల్ల ప్రజలు ఆర్థికాభి వృద్ధి సాధిస్తున్నారని చెప్పారు. అమ్మ ఒడి పథకం వల్ల ప్రతీ పేదవాడు తమ పిల్లలను చదివిస్తున్నార ని, ఈ పథకం వల్ల డ్రాపౌట్స్ గణనీయంగా తగ్గాయని, అలాగే నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారా యని అన్నారు. ప్రజలకు మంచి చేయాలని నిరంతరం పరితపించే వ్యక్తి సీఎం జగన్ అని, ఆయన్ని ప్రజ లంతా ఆశీర్వదించాలని కోరారు. జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఎంపీటీసీ సీహెచ్ చంద్రకళ, సర్పంచ్ శిరికి అచ్చియ్యమ్మ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు లచ్చిరెడ్డి కృష్ణ , పి.నారాయణమూర్తి, కిలపర్తి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 'గడప గడపకు' నిధులతో సమస్యలకు చెక్



ఆంజనేయపురంలో నిర్మించిన సిమెంట్ రోడ్డు

**చీపురుపల్లి:** ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'గడప గడ పకు మన ప్రభుత్వం' గ్రామాల్లో దీర్ఘకాల సమస్య లకు పరిష్కారం చూపిస్తోంది. 'గడప గడపకు మన ప్రభుత్వం' పూర్తయిన గ్రామ సచివాలయా లకు ప్రభుత్వం రూ.20 లక్షలు చొప్పున కేటాయి స్తోంది. ఈ నిధులతో ఆయా గ్రామాల్లో తక్షణం అవసరమైన పనులను చేపడుతున్నారు. అందులో భాగంగానే చీపురుపల్లి పట్టణంలోని సచివాలయం –3 పరిధిలోని ఆంజనేయపురంలో రూ.8 లక్షలతో సిమెంట్ రోడ్డు పునరుద్ధరించారు. ఆంజనేయపు రంలో చాలా కాలం క్రితం నిర్మించిన సిమెంట్ రోడ్డు పూర్తిగా శిథిలం అయింది. సమస్యను ఆ ప్రాంతా నికి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి వచ్చిన అధికారులు, ప్రజాప్రతిని ధుల దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. ప్రజాప్రతిని ధులు స్పందించి గడప గడప కు మన ప్రభుత్వం నిధుల నుంచి రూ.8 లక్షలు సీసీ రోడ్డుకు మం జూరు చేశారు.

### వర్షంతో ఉపశమనం



వేపాడలో కురుస్తున్న వర్షం

**వేపాడ:** మండలంలో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షంతో ఉక్కపోత నుంచి ప్రజలకు ఉపశమనం లభించింది. ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటలవరకు విపరీతమైన ఎం డ కాయడంతో ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అయ్యారు. వేపాడ, వల్లంపూడి, జగ్గ య్యపేట, సోంపురం, అరిగిపా లెం, పాటూరు, బొద్దాం తదితర గ్రామాల్లో సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఓ మోస్తారు వర్షం కురిసింది. వరి నారుమడులకు ఈ వర్షం ఎంతో మేలు చేస్తుందని రైతులు అంటున్నారు.

## కార్పొరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



రాష్ట్ర బంద్ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏబీవీపీ సభ్యులు

**చీపురుపల్లి:** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూళ్లు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేటు పాఠ శాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వంశీ కుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని లయన్స్‌క్లబ్ హాలులో ఆదివారం నిర్వ హించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ కార్పొరేట్, ప్రైవేటు యాజమాన్యాలు అధిక ఫీజులు దోపిడీని నిరసిస్తూ, ప్రభుత్వం వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈనెల 5న ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చినట్లు చెప్పారు. కార్పొరేట్ విద్యా సంస్థలు అధిక ఫీజులు మాత్రమే కాకుండా పుస్తకాలు, ఏకరూప దుస్తులు పేరుతో తల్లిదండ్రులపై మరింత భారాన్ని మోపుతు న్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న యాజమాన్యాల లైసె న్సులు రద్దు చేసి, సీజ్ చేయాలన్నారు. ఈనెల 5న నిర్వహించే బంద్‌కు అంతా సహకరించాలని కోరారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### వర్మీకంపోస్ట్ ఉత్పత్తి పెంపునకు చర్యలు

**గజపతినగరం:** మండలంలోని అన్ని చెత్త నుం చి సంపద తయారీ కేంద్రాల్లో వర్మీకంపోస్ట్ ఉత్పత్తిని మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఈఓపీఆర్డీ జనార్దనరావు ఆదివారం తెలిపారు. రైతులందరికీ వర్మీకంపో స్టును తక్కువ ధరకు సరఫరా చేసేందుకు ఉత్పత్తి పెంచాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించామని పేర్కొన్నారు. మండలంలో ఉన్న 21 గ్రామ సచివాలయాల్లోని చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాల్లో వర్మీకంపోస్టు, తడి, పొడి చెత్తతో సేంద్రియ ఎరువులను తయారు చేసి రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు.

### 4న చినబంటుపల్లి, చెల్లాపురంలో 'జగనన్న సురక్ష'

**మెరకముడిదాం:** మండలంలోని చినబంటుప ల్లి, చెల్లాపురం గ్రామాల్లో ఈనెల 4వ తేదీన 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించను న్నట్టు ఎంపీడీఓ ఎం.రత్నం ఆదివారం ఓ ప్రక టనలో తెలిపారు. ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు అందజేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. మండల అధికా రులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

## పీహెచ్‌సీలో తాగునీటి సమస్య పరిష్కారం



పీహెచ్‌సీ ఆవరణలో బోరు తవ్వకాలు(ఫైల్)



పీహెచ్‌సీలో కుళాయి ద్వారా సరఫరా అవుతున్న నీరు

**బొండపల్లి:** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహె చ్‌సీ)లో తాగునీటి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. పీహెచ్‌సీ ప్రారంభించి దశాబ్దం పైగానే అయినప్పటికీ తాగునీటి సౌకర్యం కల్పించలేదు. ఆస్పత్రి ఆవరణలో పలుమార్లు బోర్లు తవ్వించిన ప్పటికీ నీరు పడలేదు. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఈవిషయాన్ని ఆస్పత్రి వైద్యులు ఎల్. సత్యనారాయణ ఎమ్మెల్యే బొత్స అప్పలనరస య్య, ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.వి.ప్రభూజీ దృష్టికి తీసు కువెళ్లారు. ఆస్పత్రిలో బోరు తవ్వించినా నీరు పడక పోవడంతో గ్రామంలోని రక్షిత మంచినీటి పథకం నుంచి పైపులైను ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల మండల ప్రత్యేక అధికారిగా భూగర్భ జలవనరుల శాఖ డీడీ ఎస్.వి.కె.దుర్గాప్రసాద్ నియమితుల య్యారు. సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆయనకు సూచించారు. ఆయన జియాలజిస్ట్‌లతో కలిసి అత్యాధునిక పరికరాలతో ఆస్పత్రి ఆవరణ మొత్తం నీటి జాడను పరిశీలించారు. ఆస్పత్రి ఆవ రణలో ఓ ప్రాంతంలో నీటిజాడ లభ్యం కావడంతో బోరు తవ్వించారు. నీరుపడడంతో బోరు, పైపులైన్లు ఏర్పాటు చేశారు. ఏన్నో ఏళ్ల సమస్య పరి ష్కారం కావడంతో రోగులు,వైద్య సిబ్బంది సం తోషం వ్యక్తం చేస్తున్నారు.

### గురువు పూజ్యనీయుడు

**విజయనగరం:** గురువు సర్వదా పూజ్యనీ యుడని రచయిత్రి చివుకుల శ్రీలక్ష్మి అన్నారు. ఆదివారం స్థానిక విజ్ఞానభారతిలో రోటరీ సం గీత పాఠశాల అధ్యాపకుడు ఎం.కామేశ్వర రావు, కూచిపూడి గురు వు రమణకుమారి, చాగంటి రాజ్యలక్ష్మి, తదితరుల ను శాలువలు, జ్ఞాపికలతో సత్కరించారు. రోటరీ క్లబ్ ప్రధాన కార్యదర్శి బి.సూర్యలక్ష్మి, రచయిత్రి చివుకుల శ్రీలక్ష్మి, సంస్కార భారతి రామ్‌కుమార్ ఆధ్వ ర్యంలో జరిగిన ఈ గురుపూజోత్సవంలో పలు వురు వక్తలు గురువు ఔన్నత్యాన్ని వివరించారు. విశిష్ట అతిథి ప్రసాద్ మాట్లాడుతూ, జ్ఞాన సంప ద ను అందించే గురువును సాక్షాత్ పరబ్రహ్మ స్వరూపంగా వేదాలు, పురాణాలు చెబుతున్నా యన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రద ర్శించిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమం లో ఆత్మీయ అతిథి శేఖ ర్ పాల్గొన్నారు.

### నేటి కార్యక్రమాలు

**పీడీఎస్ బియ్యం వేలం**

**గజపతినగరం:** స్థానిక వ్యవసాయశాఖ మార్కెట్ కార్యాలయ ప్రాంగణంలోని ఎంఎల్‌ఎస్ పాయిం ట్ వద్ద పీడీఎస్ బియ్యం సోమవారం వేలం వేయ నున్నట్టు పౌరసరఫరాలశాఖ డీటీ తహసీల్దార్ రవిశంకర్ ఆదివారం తెలిపారు. ఇటీవల అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన 233.50 క్వింటాళ్ల బియ్యంను జేసీ ఆదేశాల మేరకు వేలం వేస్తున్నా మని, ఆసక్తిగలవారు వేలంలో పాల్గొనవచ్చని సూచించారు.

**గరుగుబిల్లిలో వైద్యశిబిరం**

**మెరకముడిదాం:** మండలంలోని గరుగుబిల్లి గ్రామంలో ఎంపీటీసీ చిరంజీవిరావు, సర్పంచ్ అవాల అప్పలనాయుడు ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు గ్రామపె ద్దలు ఆదివారం తెలిపారు. శిబిరంలో శ్రీకాకుళం జిల్లా జెమ్స్ ఆస్పత్రి వైద్యులు వైద్యసేవలందిస్తారని చెప్పారు. గ్రామస్తులతో పాటు చుట్టు పక్క గ్రామాల వారు శిబిరాన్ని సద్వినియోగించుకో వాలని సూచించారు.

**వేపాడలో అమ్మ ఒడి సంబరాలు**

**వేపాడ:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు అమ్మ ఒడి సంబరాలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ బాలభాస్కరరావు ఆదివారం తెలిపారు. ముఖ్య అతిథిగా నియోజకవర్గ శాసనసభ్యులు కడుబండి శ్రీనివాసరావు హాజరు కానున్నారని చెప్పారు. అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

**రామచంద్రాపురంలో 'జగనన్న సురక్ష'**

**దత్తిరాజేరు:** రామచంద్రాపురం సచివాలయంలో సోమవారం 'జగనన్న సురక్ష' క్యాంపు నిర్వహిం చనున్నట్టు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదివారం తెలి పారు. వివిధ ధ్రువపత్రాలకు దరఖాస్తు చేసుకున్న ప్రజలకు ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనా యుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి ధ్రువపత్రాలు అందజేస్తారని చెప్పారు. సచివాలయ సిబ్బందితో పాటు అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

## వైభవంగా పశలమ్మ పండగ



ఊరేగింపుగా అమ్మవారి శతకం పట్టు వద్దకు వెళుతున్న గ్రామస్తులు



మహిళల కోలాటం

**వేపాడ:** మండలంలోని చామలాపల్లి గ్రామంలో పశ లమ్మ పండగ ఆదివారం వైభవంగా నిర్వహిం చారు. గ్రామస్తులు ఊరేగింపుగా అమ్మవారి శతకం పట్టు వద్దకు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఏటా సంప్రదాయం ప్రకారం ఖరీఫ్ వరినాట్లుకు ముందు ఈ పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామపెద్దలు తెలిపారు. పశువులు ఆరో గ్యంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

## నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు

**జామి:** మండలంలోని విజినిగిరి గ్రామంలో 20 పేదకుటుంబాలకు హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అధ్యక్షుడు సన్యాసినాయు డు మాట్లాడుతూ ప్రతీ నెల తమ సంస్థ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తు న్నామని చెప్పారు.హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

## పాల ఉత్పత్తిదారుల సంఘం ఎన్నిక

**వేపాడ:** వేపాడ పాల ఉత్పత్తిదారుల సహకార సం ఘం (విశాఖ డెయిరీ) పాలకవర్గాన్ని సభ్యులు ఆది వారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా నాగి రెడ్డి దేముడు బాబును, డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు దేముడుబాబుతో పి.ఎ స్.సత్యారావు, సంఘం డైరెక్టర్లతో గ్రామపెద్దలు దాలినాయుడు, నర్సింహమూర్తి, ముత్యాలు నాయుడు, ఎం.రమణ ప్రమాణస్వీకారం చేయిం చారు. దేముడుబాబు మాట్లాడుతూ డైరెక్టర్లు, సభ్యుల సహకారంతో సంఘం అభివృద్ధికి కృషిచే స్తామన్నారు. అనంతరం సభ్యులకు స్టీల్ క్యాన్‌లు అందజేశారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

**భోగాపురం:** రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వైఎస్సార్‌సీపీ నేత, దివంగత సుందర గోవిందరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు సుందర హరీష్ ఏర్పాటు చేసిన రక్తదా నం శిబిరాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, ఆపద సమయంలో రక్తం అందక ఎంతో మంది మృత్యువాత పడుతున్నారన్నారు. రక్తం నిల్వలు పెంచుకోవడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో క్షతగాత్రులు, రోగులకు అందించవచ్చని చెప్పారు. 100 మందికి పైగా యువకులు రక్తదానం చేయడం తో వారందరినీ ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్ర మంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి కందుల రఘుబాబు, కొమ్మూరు సుభోషణరావు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి, బైరెడ్డి ప్రభాకరరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ఎర్ర ప్పలనారాయణ, ఉప్పాడ విజయభాస్కరరెడ్డి, పడా ల శ్రీనివాసరావు, బైరెడ్డి రమణ, పోతిరెండి గోపి, వార్డు నంబర్ అప్పారావు, సీహెచ్‌సీ వైద్యులు శాలి ని, అలేఖ్య, ల్యాబ్ టెక్నీషియన్ రామకృష్ణ, వేణుగో పాల్, శ్రీనివాస్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## పొడి దగ్గు ఉంటే టీబీ పరీక్ష చేయించుకోవాలి




కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ్

**విజయనగరం ఫోర్ట్:** రెండు వారాలకు మించి దగ్గు ఉన్నట్టైతే టీబీ పరీక్ష చేయిం చుకోవాలని విశాఖపట్నం సాగర్‌దుర్గా చెస్ట్ ఫిజీషియన్ జె.ప్రవీణ్ అన్నారు. ఆదివారం స్థానిక ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘ కార్యాలయం లో సీజనల్ వ్యాధుల పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల పట్ల గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జ్వరం రెండు, మూడు రోజులున్నట్టైతే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్య క్రమంలో డాక్టర్ నవీన్ పేంపా, డాక్టర్ ఎస్‌ఎల్ రావు, గ్రామీణ వైద్యుల సంఘం జోనల్ అధ్యక్షుడు జంగం జోషి, జిల్లా అధ్యక్షు డు గద్దె చిరంజీవి, కార్యవర్గ సభ్యులు గౌరినాయు డు, ఉమాశంకర్, రమణ, తదితరులు పాల్గొన్నారు.